

వీఐపీ రోడ్డులో భారీ గొయ్యి



కృష్ణా కళాశాల సిగ్నల్ దాటాక దెబ్బతిన్న రహదారి



ఇసుకతోట జంక్షన్ దాటిన తర్వాత రహదారిపై ఏర్పడిన గోతులు

రహదారులు ఛిద్రం

మధురవాడకు చెందిన **రవికుమార్** ఉదయం 9 గంటల సమయంలో **తన ద్విచక్ర** వాహనంపై అక్కయ్యపాలెంలోని **తాను పనిచేసే** కార్యాలయానికి వెళ్తున్నాడు. ఇసుక**తోట సిగ్నల్** పాయింట్ దాటిన తర్వాత రోడ్డు **మధ్యలోని** గోతిలో తన వాహనం పడి కింద **పడిపోయాడు.** రవికుమార్ వెనుక వస్తున్న కార్ స**డన్ బ్రేక్ వేయ**డంతో పెను ప్రమాదం తప్పింది. **రవికుమార్** కాలు, చేతికి గాయాలయ్యాయి.

ఎంవీపీ కాలనీకి చెందిన సునీత **అనే మహిళా** ఉద్యోగి డాబాగార్డెన్స్‌లోని తన **కార్యాలయానికి** స్కూటీపై వెళ్తున్నారు. మద్దిలపాలెం వద్ద రోడ్డు మధ్యలో ఉన్న భారీ గోతిలో పడి గాయపడ్డారు.

ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. రోజూ పదుల సంఖ్యలో వాహన చోదకులు రోడ్లపై ఏర్పడిన భారీ గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు. వాహనాలు గోతుల్లో పడి మరమ్మతులకు గురికావడంతో మరికొందరు చేతి చమురు వదిలించుకుంటున్నారు.

- భారీ వర్షాలతో రోడ్లు గోతులమయం
- వాహన చోదకులకు ప్రాణసంకటం
- కనీస మరమ్మతులు చేపట్టని అధికారులు



హైవేపై ఇసుకతోట బస్టాప్ ఎదురుగా ధ్వంసమైన రోడ్డు

మద్దిలపాలెం: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ప్రధాన రహదారులు ధ్వంసమవుతున్నాయి. ఎక్కడికక్కడ ఛిద్రమై గోతులమయంగా మారాయి. రోడ్డు మధ్యలో ఏర్పడిన పెద్ద పెద్ద గోతులు ప్రమాదాలకు నిలయమయ్యాయి. సంబంధిత అధికారులు సకాలంలో రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహన చోదకులకు ప్రాణసంకటంగా మారాయి. జాతీయ రహదారిపై వెంకోజీపాలెం సిగ్నల్ పాయింట్ దాటి కాస్తా ముందుకు రాగానే భారీ గోతులు దర్శనమిస్తున్నాయి. వాటిని దాటుకుని ఇసుకతోట జంక్షన్ తర్వాత రోడ్డు పెద్ద గోతులతో నిండిపోయింది. వాటి వల్ల వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇసుకతోట నుంచి కృష్ణా కళాశాల సిగ్నల్ పాయింట్ వరకూ సుమారు పది గోతుల వరకూ ఉన్నాయి. ఇవన్నీ రోడ్డు మధ్యలో ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి.

ప్రమాదాలకు నిలయం

డాక్టర్ వి.ఎస్.కృష్ణా కాలేజీ నుంచి మద్దిలపాలెం సిగ్నల్ పాయింగ్‌కు మధ్యలో పెద్ద గొయ్యి ఏర్పడింది. దీనికి స్థానికులు మరమ్మతులు చేసినా మళ్లీ అదే పరిస్థితి నెలకొంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో గోతుల కారణంగా ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని చూసుకోకుండా వచ్చే వాహన చోదకులు ఆకస్మికంగా బ్రేక్ వేయడంతో ఒకటి దాని వెనుక ఒకటి ఢీకొట్టుకుంటున్నాయి. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. ఇక మద్దిలపాలెం నుంచి సత్యం జంక్షన్ వరకు ఉన్న గోతులు ప్రమాదకరంగా మారాయి.

బారికేడ్ల ఏర్పాటు

హైవేపై ఇసుకతోట బస్‌స్టాప్ ఎదురుగా సుమారు 50 మీటర్ల మేర రోడ్డు ధ్వంసమైంది. ఇక్కడ పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. దీంతో ఈ గోతుల వద్ద అడ్డంగా ట్రాఫిక్ పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు.

దెబ్బతింటున్న ద్విచక్ర వాహనాలు

రహదారి గోతుల్లో పడిన ద్విచక్ర వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. గోతుల వద్ద తప్పించబోయి సడన్ బ్రేక్‌లు వేయడంతో చిన్న చిన్న ప్రమాదాలు జరిగి బైక్ పార్ట్స్ పాడవుతున్నాయి. ఇలా ద్విచక్ర వాహన చోదకులు చేతి చమురు వదిలించుకుని తమ వాహనాలను బాగు చేయించుకుంటున్నారు.

గోతులు పూడ్చకుంటే మరింత ప్రమాదం

రోడ్డు మధ్యలో ఏర్పడిన గోతులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. వీటిని తక్షణమే పూడ్చాలని ద్విచక్ర వాహనదారులు కోరుతున్నారు. రహదారుల్లో పెద్ద పెద్ద గోతులు ఏర్పడినా.. పాలకులు, అధికారులు పట్టించుకోకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటం తగదన్నారు. తక్షణమే మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎంవీపీ సీఐగా మురళి బాధ్యతల స్వీకరణ

ఎంవీపీకాలనీ: ఎంవీపీ పోలీస్ స్టేషన్ లా అండ్ ఆర్డర్ సీఐగా జె.మురళి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గత సీఐ సంజీవ రావు ఇటీవల విశాఖ రేంజ్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే. నగర పోలీస్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు శుక్రవారం ఉదయం మురళీ విధుల్లో చేరారు. ఆయన గతంలో పెందుర్తి, ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ల పరిధిలో సేవలందించారు. ఈ సందర్భంగా సీఐ మురళికి స్టేషన్ వర్గాలు అభినందనలు తెలిపాయి.

అప్పన్న అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళం



దాత శ్రీనివాస్‌కు బాండ్ అందిస్తున్న ఏఈవో శ్రీనివాసరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శుక్రవారం నగరంలోని ఇసుకతోట ప్రాంతానికి చెందిన ఆకెళ్ల శ్రీనివాస జవహర్‌లాల్ నెహ్రూ రూ.లక్ష విరాళాన్ని నగదు రూపంలో అందించారు. సింహగిరిపైనున్న పీఆర్వో కార్యాలయంలో దాతకు అన్నప్రసాద విభాగం సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు బాండ్‌ని అందించారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఆలయ అధికారులు అందజేశారు.

క్లుప్తంగా

విమ్స్ స్థలం ఆక్రమణకు అడ్డుకట్ట



ఆక్రమణను అడ్డుకుంటున్న విమ్స్ సిబ్బంది

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో ఆక్రమణదారులు దేనినీ వదలడం లేదు. గెడ్డలు, జీవీఎంసీ, రెవెన్యూకు చెందిన ఖాళీ స్థలాల్లో పాకలు వేసేస్తున్నారు. ఇందులో భాగంగా విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) స్థలాన్ని కూడా వదలలేదు. తోటగరువు ఎర్నిదుర్గమాంబ ఆలయం ఎదురుగా నిర్మాణంలో ఉన్న రైతుబజార్ పక్కన విమ్స్ స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించి చదునుచేశాడు. దానిలో రెండు రోజులుగా కమ్మల పాక వేయడానికి పనులు చేపట్టాడు. విషయం తెలుసుకున్న విమ్స్ అధికారులు శుక్రవారం సిబ్బందిని అక్కడికి పంపించి నిర్మాణ పనులు నిలిపేశారు. ఆక్రమణదారుడిపై కేసు పెడతామని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు.

త్రీ టౌన్ సీఐకు అభినందన



సీఐ రమణయ్యకు అభినందనలు తెలుపుతున్న పల్లా దుర్గారావు

బీచ్‌రోడ్డు: మూడో పట్టణ లా అండ్ ఆర్డర్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన పల్లా రమణయ్యను పలువురు అభినందిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ 28వ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు శుక్రవారం సీఐను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అల్లి నారాయణ, సంపంగి సురేష, కోన కామేష్, చట్టి చిన్న తదితరులు పాల్గొన్నారు.

'ఎగుమతి వ్యాపారం'పై సర్టిఫికెట్ కోర్సు


విశాఖ సిటీ: ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫ్యాప్సీ) ఆధ్వర్యంలో 'ఎగుమతి వ్యాపారాన్ని ఎలా ప్రారంభించాలి'అన్న అంశంపై ఐదు రోజుల ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి పి.వైదేహి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ సెషన్లు ఉంటాయని వివరించారు. కొత్త వ్యాపారవేత్తలను ఎగుమతి వ్యాపారంలోకి ప్రోత్సహించేందుకు ప్రముఖ సంస్థల నుంచి నిపుణులు, కన్సల్టెంట్ల ద్వారా ఈ సెషన్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మర్చంట్ ఎగుమతిదారులు, తయారీదారులు, సర్వీస్ ప్రొవైడర్లు, ఎస్ఎంఈలు, వ్యాపారులు, భావి ఎగుమతిదారులు/వ్యాపారవేత్తలు ఈ ఆన్‌లైన్ ప్రోగ్రాంకు హాజరుకావచ్చన్నారు. ఇతర వివరాలకు 93914 22821కు సంప్రదించవచ్చు.

మబ్బుల్లో హాయ్ హాయ్..



వానా కాలపు సాయంత్రం.. నల్లని మేఘాలతో నిర్మలంగా ఆకాశం.. ఎగసి పడే సముద్ర తీరం.. చల్లని గాలులు.. జల్లుజల్లుగా కురుస్తున్న వర్షం.. ఇలా శుక్రవారం సాయంత్రం ఆర్కే బీచ్‌లో వాతావరణం ఆవిష్కృతమైంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. దట్టంగా కమ్ముకున్న కారుమబ్బులు సముద్రాన్ని కౌగిలించుకున్నట్టుగా దర్శనమిచ్చాయి. ఈ సుందర దృశ్యాలను పర్యాటకులు ఆస్వాదించారు.

- బీచ్‌రోడ్డు



విద్యార్థుల ఫిర్యాదులపై సత్వర స్పందన



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేసలి అప్పారావు, సీతారాం తదితరులు

ఎంవీపీకాలనీ: విద్యార్థుల ఫిర్యాదులపై పాఠశాలల యాజమాన్యాలు సత్వరం స్పందించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాంలు పేర్కొన్నారు. ఎంవీపీ కాలనీలోని శ్రీ సత్యసాయి విద్యా విహార్, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సంయుక్తంగా 'బాలల హక్కుల పరిరక్షణలో టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగుల పాత్ర' అనే అంశంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించాయి. ముఖ్య అతిథులుగా జ్యోతి వెలిగించి వారు మాట్లాడుతూ బాలల హక్కులను పరిరక్షించడంలో రాష్ట్రంలోని అన్ని పాఠశాలల బోధన, బోధనేతర సిబ్బంది నిబద్ధతతో వ్యవహరించాలన్నారు. ప్రతి విద్యార్థి వారి ఇంటి విద్యార్థిగా భావించి స్వేచ్ఛాపూర్వక వాతావరణంలో విద్యను అందించాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై కమిషన్‌కు నిత్యం ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయని తెలిపారు. వీటిని క్షేత్ర స్థాయిలోనే పరిష్కరించాల్సిన బాధ్యత పాఠశాలల యాజమాన్యాలపైనే ఉందన్నారు. ఈ దిశగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇందుకు అనుగుణంగా విద్యాశాఖ అధికారులు, ఉద్యోగులు జాయినింగ్ సమయంలోనే వారికి పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషన్ ఆదేశాలతో పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల ఫిర్యాదు బాక్స్‌ను ప్రిన్సిపాల్ వరలక్ష్మితో కలిసి అప్పారావు, సీతారాంలు ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా విద్యార్థులు ఎదగాలి



ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ ఎం.వి.ఆర్.రాజు

విశాఖ సిటీ: విద్యార్థులు భవిష్యత్తులో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, అందుకు ఇప్పటి నుంచి అవసరమైన మార్గాన్ని నిర్మించుకోవాలని ఏయూ సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.వి.ఆర్.రాజు సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం(ఏఏఏ) సహకారంతో పారిశ్రామికవేత్తలుగా ఎదుగుదల అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. దీనికి 150 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక రంగంలో ఆవిష్కరణలు, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు గల అవకాశాలను వివరించారు. అనంతరం గౌరవ అతిథి జీవనజ్యోతి వల్ల మాట్లాడుతూ పారిశ్రామిక రంగంలో సవాళ్లు, అవకాశాలను విశదీకరించారు. సదస్సులో పూర్వ విద్యార్థుల రిలేషన్స్ ఆఫీసర్ వఫీర జొన్నాడ, బోటనీ విభాగాధిపతి ప్రొఫెసర్ డి.సంధ్యాదీపిక తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలలుగా వేతనాలు నిల్

ఇబ్బంది పడుతున్న ఆరిలోవ ఎఫ్ఆర్‌యూ సిబ్బంది



ఆరిలోవ ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రి

ఆరిలోవ: ఆరిలోవ జీవీఎంసీ ఆస్పత్రిలో సిబ్బందికి సకాలంలో వేతనాలు అందడం లేదు. ఇక్కడ జీవీఎంసీ ఆధ్వర్యంలో ఫస్ట్ రిఫరల్ యూనిట్(ఎఫ్ఆర్‌యూ) ప్రజలకు ఉచిత వైద్యం అందిస్తున్న విషయం తెలిసిందే. దీని నిర్వహణ బాధ్యతలు జీవీఎంసీ కొన్నేళ్లుగా రెడ్‌క్రాస్ సంస్థకు అప్పగించింది. నిర్వహణ కాలం ముగిసినప్పటికీ మూడు నెలల చొప్పున వారికి నిర్వహణ బాధ్యతలు పొడిగించుకుంటూ కాలం గడుపుకొస్తోంది. ఇదిలా ఉండగా ఇక్కడ వైద్యేతర సిబ్బంది 17 మంది ఉన్నారు. వీరికి మూడు నెలలుగా వేతనాలు బకాయిలున్నాయి. నాలుగు నెలల బకాయిల్లో ఇటీవల ఒక నెల మాత్రమే చెల్లించినట్లు సిబ్బంది తెలిపారు. ప్రస్తుతం మూడు నెలల వేతనం బకాయిలు ఉండటంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. ఈ ఆస్పత్రి నిర్వహణ కోసం రెడ్‌క్రాస్ సంస్థకు జీవీఎంసీ నెలకు రూ.8.50 లక్షలు చెల్లిస్తోంది. ఆ డబ్బులతో ఇక్కడికి వెళ్తున్న రోగులకు మందులు, వైద్యులకు జీతాలు, సిబ్బందికి వేతనాలు చెల్లించాలి. జీవీఎంసీ నుంచి డబ్బులు తీసుకుంటున్న ఆ సంస్థ ఇక్కడ సిబ్బందికి మాత్రం నెలనెలా వేతనాలు చెల్లించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

వినాయక పందిళ్ల వద్ద అన్నసంతర్పణలు



28వ వార్డులో అన్నదానం చేస్తున్న పల్లా దుర్గారావు

ఆరిలోవ: వినాయక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పలుచోట్ల అన్నసంతర్పణలు నిర్వహించారు. 11వ వార్డు గాంధీనగర్, శ్రీహరినగర్ ప్రాంతాల్లో జరిగిన అన్నసమారాధనలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొన్నారు. విఘ్నేశ్వరుడికి ఆయన పూజలు చేసి, భక్తులకు భోజనాలు వడ్డించారు. టీడీపీ నాయకులు ముగడ రాజారావు, ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం తదితరులు పాల్గొన్నారు. 12వ వార్డు పెదగదిలిలో స్థానిక యూత్ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ నిర్వహించారు. స్థానిక అధ్యక్షుడు బుడుమూరు గోవింద్, సభ్యులు రమణ, సతీష్, సియ్యాద్రి, శ్రీను పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు దసపల్లా హిల్స్‌లోని బంగారమ్మ గుడి వద్ద మహా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈళ్లిపిల్లి నరసింగరావు, ఈగల త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

- 22వ వార్డు పీతలవానిపాలెంలో గణేష్ బాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షులు పీతల గోవింద్ పాల్గొని భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు అశోక్, లోకేష్, జగదీష్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలకు పోటెత్తిన నిరుద్యోగులు



హెచ్‌బీ కాలనీ రోడ్డులో ఫంక్షన్ హాల్ వద్ద ఇంటర్వ్యూలకు హాజరైన నిరుద్యోగులు

మద్దిలపాలెం: అదానీ స్మార్ట్ మీటర్ల కంపెనీలో ఉద్యోగాలకు వేలాది మంది నిరుద్యోగులు తరలి వచ్చారు. ఏపీఈపీడీసీఎల్ సర్కిల్ వారీగా పలు పోస్టులను భర్తీ చేస్తున్నారు. దీనిలో భాగంగా హెచ్‌బీ కాలనీ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీటికి సుమారు 3 వేల పైచిలుకు నిరుద్యోగులు హాజరయ్యారు. దీంతో హెచ్‌బీ కాలనీ రద్దీగా తయారైంది. రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అవడంతో పోలీసులు వాహనాల రాకపోకలను నియంత్రించారు. ఇంత మంది నిరుద్యోగులు ఫంక్షన్ హాల్ వద్ద గుమిగూడి ఉండడంతో అక్కడ ఏం జరుగుతుందో ఎవరికీ అర్థం కాలేదు. ఏంటా అని ఆరా తీయగా.. అదానీ స్మార్ట్ మీటర్ల కంపెనీలో ఉద్యోగుల కోసం ఇంటర్వ్యూలు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు జిల్లాలకు చెందిన వారు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కంపెనీలో జూనియర్ ఇంజినీర్, ఫీల్డ్ సూపర్‌వైజర్, ఇన్‌స్టాలర్, హెల్పర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లాల వారీగా ఈ పోస్టులను ఎంపిక చేయనున్నారని అభ్యర్థులు పేర్కొన్నారు. అనూహ్యంగా ఆ పోస్టులకు వేలాది మంది హాజరు కావడంతో ఈ ప్రాంతం రద్దీగా మారింది.

ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ ప్రోగ్రాం శీతాకాల ప్రవేశాలు ప్రారంభం

బీచ్‌రోడ్డు: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) విశాఖపట్నం ఎగ్జిక్యూటివ్ మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ) ప్రోగ్రాం కోసం శీతాకాల ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రోగ్రాం ద్వారా అభ్యర్థులకు సమగ్ర నిర్వహణ సామర్థ్యాలను అందించడమే లక్ష్యమని ఐఐఎం విశాఖపట్నం డైరెక్టర్ చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధునాతన మేనేజ్‌మెంట్ నైపుణ్యంతో పని చేసే నిపుణులను శక్తివంతం చేయడం లక్ష్యంగా టైమ్స్‌ప్రో సంస్థతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఈ ప్రోగ్రాం వ్యూహాత్మక దూరదృష్టితో, విశ్వాసంతో ఆధునిక వ్యాపార చిక్కులను నేర్పుగా తొలగిస్తూ ముందుకు వెళ్లగల నాయకులను తయారు చేయడానికి రూపొందించిందని వెల్లడించారు. మార్కెటింగ్, ఆర్థికశాస్త్రం, ఫైనాన్స్, అకౌంటింగ్, ఆర్గనైజేషనల్ బిహేవియర్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, మానవ వనరులు, వ్యూహాత్మక ఆలోచన, ఉత్పత్తి, ఆపరేషన్స్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, బిజినెస్ ఎథిక్స్, చట్టం తదితర అంశాలు ఈ ప్రోగ్రాంలో ఉంటాయని వివరించారు.

'యూ జీనియస్ 3.0' క్విజ్ పోటీల విజేత డీపాల్

సీతంపేట: యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా జోనల్ ఆఫీస్ ఆధ్వర్యంలో శుక్రవారం అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో 8 నుంచి 12 ఏళ్ల వయసు గల విద్యార్థులకు 'యూ జీనియస్ 3.0' నేషనల్ జనరల్ అవేర్‌నెస్ క్విజ్ కాంపిటేషన్–2024 పోటీలు జరిగాయి. శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, విశాఖ జిల్లాలకు చెందిన 116 పాఠశాలల నుంచి 435 బృందాలు ఉత్సాహంగా పాల్గొన్నాయి. కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ముఖ్య అతిథిగా జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న విజ్ఞానం, ప్రతిభా పాటవాలు ఇటువంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా గుర్తించవచ్చన్నారు. ఈ పోటీల్లో డీపాల్ స్కూల్ విజేతగా.. విశాఖ వ్యాలీ స్కూల్ రన్నర్‌గా నిలిచాయి. విజేతలకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి బహుమతులు, జ్ఞాపిక, ధ్రువీకరణపత్రాలు అందించారు. ఈ రెండు జట్లు ముంబయిలో జరగనున్న గ్రాండ్ ఫినాలేలో పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. గ్రాండ్ ఫినాలే విజేతకు రూ.2 లక్షలు, మొదటి రన్నర్‌కు రూ.లక్ష, రెండవ రన్నర్‌కు రూ.50 వేలు బహూకరిస్తారన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ జోనల్ హెడ్ షాలిని మీనన్, డిప్యూటీ జోనల్ హెడ్‌లు దేవర శంకరరావు, శంకర్ హెంబ్రామ్, విశాఖ రీజనల్ హెడ్ నరసింహకుమార్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఎండీసీలో ఏయూ విద్యార్థులకు ఉద్యోగాలు



విద్యార్థికి ఆఫర్ లెటర్ అందజేస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో అదరగొట్టారు. ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎండీసీ)లో ఉద్యోగ్యాలకు ఎంపికయ్యారు. ఏయూలో ఇటీవల జరిగిన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఎమ్మెస్సీ(ఎన్విరాన్‌మెంటల్ సైన్స్)లో కుంచె అపూర్వ, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(ఎంహెచ్ఆర్ఎం) నుంచి రవిశ్రీ కిరణ్ మనవ, మిండి అచ్యుత నూకరాజు ఏపీఎండీసీలో ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనుంజయరావు చేతుల మీదుగా విద్యార్థులకు ఆఫర్ లెటర్లు అందజేశారు. కార్యక్రమంలో ఏయూ సౌత్ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ డైరెక్టర్ వి.ఆర్.రెడ్డి, ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్లేస్‌మెంట్స్ ఆఫీసర్ పి.మోహన్‌గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఏకాగ్రత, విజయం



వేణుశ్యామను సన్మానిస్తున్న ఏయూ కామర్స్ విభాగం ప్రొఫెసర్లు, విద్యార్థులు

విశాఖ సిటీ: ధ్యానం, ప్రాచీన కళావాహనతో విద్యార్థుల్లో ఏకాగ్రత, విజయం సాధించవచ్చని ఆధ్యాత్మిక వేత్త వేణుశ్యామ అన్నారు. ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో శుక్రవారం ఎంబీఏ విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. మెడిటేషన్, కళావాహనను సమ్మిళితం చేస్తూ సాధన చేయడం వల్ల వ్యక్తి జీవితంలో వృత్తిపరమైన, వ్యక్తిగత జీవితంలో ఎంతో ప్రగతిని సాధించడం వీలవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. అనంతరం వేణుశ్యామను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ట్స్, కామర్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, భాషవేత్త, ఆధ్యాత్మిక శిక్షకుడు డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్, కామర్స్ విభాగం ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూజీడీకి మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార: జీవీఎంసీ జోన్–3 పరిధి 27వ వార్డు సీబీఎం కాంపౌండ్ రోడ్డులో తరచూ లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్‌కు ఎట్టకేలకు అధికారులు మరమ్మతులు నిర్వహించారు. ఈ ప్రాంతంలో నిత్యం యూజీడీ లీకై రోడ్డు ముంపునకు గురవుతున్నాయని స్థానికులు గగ్గోలు పెడుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇక్కడి టింపనీ స్కూల్ సీ–గేటు ఎదురుగా గల రోడ్డులో యూజీడీ మ్యాన్‌హోల్ లీకవుతున్న సమస్యపై 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు జోన్–3 పబ్లిక్ వర్క్స్ అధికారులు స్పందించారు. వార్డు యూజీడీ ఇన్‌చార్జి అసిస్టెంట్ ఇంజినీర్ శివకుమార్ పర్యవేక్షణలో సిబ్బంది శుక్రవారం యూజీడీకి మరమ్మతులు చేపట్టారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

కృష్ణా కళాశాలలో హిందీ దినోత్సవం



హిందీ విభాగాధిపతి జయలక్ష్మిని సత్కరిస్తున్న కృష్ణా కళాశాల అధ్యాపకులు

మద్దిలపాలెం: మద్దిలపాలెం డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అధ్యక్షతన జాతీయ హిందీ దివస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల హిందీ విభాగాధిపతి పి.కె.జయలక్ష్మిని కృష్ణా కాలేజీ అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 1949లో హిందీని జాతీయ భాషగా గుర్తించిన నాటి నుంచి నేటి వరకూ ప్రతి ఏడాది సెప్టెంబర్ 14న హిందీ దినోత్సవాన్ని జరుపుతున్నామన్నారు. ప్రపంచంలో ఎక్కువగా మాట్లాడే భాష హిందీయేనన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, కళాశాల హిందీ అధ్యాపకురాలు బి.లక్ష్మి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

19 నుంచి కళాభారతిలో శివపదం సంకీర్తనా యజ్ఞం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ, రుషి పీఠం ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 21 వరకు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శివపదం సంకీర్తనా యజ్ఞం నిర్వహిస్తున్నామని వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎస్.రాజు, డాక్టర్ గుమ్మాలూరి రాంబాబు తెలిపారు. వాచస్పతి బ్రహ్మ శ్రీ సామవేదం షణ్ముఖ శర్మ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరగనుందన్నారు. శివపదంలో భాగంగా 19న లలితాంబిక గీతాలను తెన్నేటి శ్రీశ్రేయ, ఓలేటి విదిజ్ఞ, ఓలేటి మనోజ్ఞ ఆలపిస్తారని, 20న కౌశిక్ కల్యాణ్ కచేరీ, 21న గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌ల కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. అందరూ ఆహ్వానితులేనన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.